క్లుప్తంగా

బీసీల చైతన్యమే లక్ష్యం

తిరుమలగిరి : బీసీల చైతన్యమే మన ఆలోచన సాధన సమితి లక్ష్యమని ఆ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు అన్నారు. ఆదివారం తిరుమలగిరిలో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ బీసీ నాయకుల చైతన్య సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని పది వేల గ్రామాలలో బీసీల జెండాను ఎగురవేసినప్పుడే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సభ అధ్యక్షుడు గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం నర్సింహ, సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న, సభ నిర్వాహకులు కందుకూరి ప్రవీణ్, నాయకులు గిలకత్తుల రాము, చేను శ్రీనివాస్, గాదె బోయిన లింగయ్య, పులిమామిడి సోమయ్య, భిక్షం, నారగోని అంజయ్య, ఆకుల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రదర్శన



పోషకాహారం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని భవానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ఆదివారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల ఆహారం ప్రాముఖ్యతను కళాశాల యాజమాన్యం విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు తయారుచేసిన చికెన్, పండ్లు, జొన్న రోటీ, రవ్వ కేసరి, క్యారెట్–బీట్‌రూట్, క్యాబేజీ పకోడి వంటి వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

స్నేహితులకు పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేఖ

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన తన స్నేహితులు చిగుర్ల సుధీర్, సురేష్‌ల తండ్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు చిగుర్ల సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచాల రాము, గైగుళ్ల శ్రవణ్, మచ్చ శేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నూతనకల్ : ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి మల్లారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే వ్యవసాయ పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జానయ్య పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం



శిథిలమైన కల్వర్టు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి వెళ్లే దారిలో గ్రామ శివారు నందు కల్వర్టు శిథిలమైంది. ఇటీవల వర్షాలకు కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. కల్వర్టు వద్ద రహదారిపై గుంత ఏర్పడగా తాత్కాలికంగా మట్టి పోయించారు. ఈ కల్వర్టు ఏ క్షణంలోనైనా కూలే ప్రమాదం ఉంది. కొత్త కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోరాట ఫలితమే జీఎస్టీ రద్దు

కోదాడరూరల్ : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ పోరాట ఫలితంగానే కేంద్రం వ్యక్తిగత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ రద్దు చేసిందని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి రఘు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట, కోదాడ బ్రాంచ్‌ల యూనియన్ సంయుక్త సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో నూతన ఉద్యోగుల నియామకాలను వెంటనే చేపట్టడంతో పాటు 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.బాలస్వామి, డివిజన్ నాయకులు జావిద్, సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్‌కన్నయ్య, మోషన్‌సింగ్, ప్రభాకర్, సువర్ణ, రాణి, ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం డివిజన్ కార్యదర్శి

రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో..



రావులపల్లి ఎక్స్ రోడ్డు నుంచి తూర్పుగూడెం వరకు కంకర పోసిన రోడ్డు



తూర్పుగూడెంలో ఏర్పాటుచేసిన రోడ్డు పనుల బోర్డు

- అధ్వానంగా తూర్పుగూడెం నుంచి మామిడాల – కుంటపల్లి వెళ్లే రహదారి
- పనులను ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో తప్పని ఇబ్బందులు

తుంగతుర్తి : తూర్పుగూడెం నుంచి మామిడాల – కుంటపల్లి(ఎంకే రోడ్డు) వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు గతంలోనే ప్రభుత్వం 8.30 కిలోమీటర్ల వరకు తారు రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై కింద నిధులు మంజూరు చేసింది. ఐదేళ్లలో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించింది. దీంతో 2023లో పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ ఎంకే రోడ్డు నుంచి తూర్పుగూడెం వరకు మట్టిరోడ్డు వేసి దానిపై సన్న కంకర పోశాడు. కానీ ఆ తర్వాత రెండు సంవత్సరాలుగా పనులను నిలిపివేశాడు. తూర్పుగూడెం నుంచి తుంగతుర్తి షాదీఖానా వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో అధ్వానంగా ఉన్న రోడ్డుపై వెళ్లలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



ఎంకే రోడ్డు నుంచి తుంగతుర్తి షాదీఖానా వరకు తారు రోడ్డు మంజూరైంది. కానీ కాంట్రాక్టర్ పనులను మొదలుపెట్టి మధ్యలోనే ఆపివేశాడు. దీంతో ప్రయాణికులు రోడ్డుపై వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయించాలి.

– గునగంటి వెంకన్న, మాజీ ఎంపీటీసీ

ప్రజలు గర్వించదగ్గ నేత రావి నారాయణరెడ్డి



రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట అర్బన్ : ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణ రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవన్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం రావి నారాయణరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాల ధనుంజయ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లవుల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, మేకల శ్రీనివాస్, అనంతల మల్లేశ్వరి, డి.మల్లేశ్వరి, ఎస్‌కే లతు, బూర వెంకటేశ్వర్లు, కోటమ్మ, శ్రీనివాస్, రేమిడాల రాజు, ప్రభాకర్, లక్ష్మి, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సారెస్పీ నీటి విడుదల

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : మండే ఎండలతో వరి పొలాలు ఎక్కడికక్కడ ఎండిపోతుండటం.. గోదావరి జలాలు విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సాక్షిలో ఆదివారం జాడలేని గోదావరి జలాలు అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు సోమవారం (నేడు) ఉదయం 11గంటలకు జనగామ జిల్లా బయ్యన్నవాగు నుంచి సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేయాలని నిర్ణయించారు. వారబందీ విధానంలో నీటిని సాగుకు విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ ఈఈ ఎం.సత్యనారాయణగౌడ్ తెలిపారు. రైతులు కాలువలకు నష్టం కలిగించకుండా అడ్డుకట్టలు వేయకుండా నీటిని పంటలకు వాడుకోవాలని కోరారు. ఈ వర్షాకాలం పంటలు చేతికొచ్చే వరకు నీటిని ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. నీటి విడుదలతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.

ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట : పట్టణ ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అంజనాపురి కాలనీ సమీపంలోని ఆదిత్య ట్రాక్టర్ గ్యారేజ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కుంచారపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పటల్ల మహేష్, కోశాధికారిగా వాసంశెట్టి అనిల్ కుమార్, గౌరవ సలహాదారులుగా అనుముల పుల్లయ్య చారి, సుంకు కృష్ణ, షేక్ ఖాజామియా, భూక్య శంకర్, సహాయ కార్యదర్శిగా నిమ్మనగోటి లక్ష్మణ్, ఆర్గనైజర్లుగా బండారు చంద్రారెడ్డి, సోమగాని లక్ష్మయ్య, గరిగంటి లక్ష్మణ్, గొడుగు మహేందర్ ఎన్నికయ్యారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన ట్రాక్టర్ మెకానిక్‌లు ఆకుల రవి, బాబుకు ఒక్కొక్కరికి రూ.25000 చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగారం : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొడకండ్ల మండలంలోని బయ్యన్న వాగు రిజర్వాయర్ స్టేజ్–2 వద్ద తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం ఎస్సారెస్పీ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తారని తెలిపారు. రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం గోదావరి జలాలు విడుదల చేయడం హర్షణీయమన్నారు. కొడకండ్లలో జరిగే ఎస్సారెస్పీ నీటి విడుదల కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషం యాదవరెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, నాతి వీరమల్లుగౌడ్, రాంరెడ్డి, వల్లాల భాను, ఆకుల ప్రతాప్, కొలిపాక సాయి పాల్గొన్నారు.

జలాల విడుదల కార్యక్రమానికి తరలిరావాలి

అర్వపల్లి : ఎమ్మెల్యే మందుల సామేల్ చేతుల మీదుగా సోమవారం కొడకండ్లలో జరిగే గోదావరి జలాల విడుదల కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం కోరారు. ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాల విడుదలతో ఈ సీజన్‌లో రైతులకు సాగు నీటి సమస్య తీరనుందని పేర్కొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న దశరథ

సూర్యాపేట : అధ్వానంగా మారిన రోడ్డుకు సొంత ఖర్చుతో 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పంతంగి దశరథ ఆదివారం మరమ్మతు చేయించారు. జిల్లా కేంద్రంలోని 14వ వార్డు వినాయక నగర్ కాలనీలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షాల కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ దశరథకు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగంపల్లి సృజన్, వరిపల్లి లక్ష్మయ్య, రత్నావత్ నాగరాజు, జాటోత్ రాజేష్ నాయక్, కాలనీవాసులు సామ ఇంద్రారెడ్డి, పాపయ్య, పిన్నాని నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

తిరుమలగిరి : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలగిరి మండలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని పొలాలను పరిశీలించి మాట్లాడారు. నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. వెంటనే శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేసి తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, నాయకులు కడారు లింగయ్య, కడియం లింగయ్య, చిత్తలూరి సోమయ్య, మిట్టపల్లి లక్ష్మి, దూపటి లింగయ్య ఉన్నారు.

ఆత్మజ్ఞానంతో ప్రశాంతత

హుజూర్‌నగర్ : ఆత్మజ్ఞానంతో జీవితంలో సుఖసంతోషాలు, ప్రశాంతత లభిస్తాయని ఇస్కాన్ మందిరం ప్రవచన వక్త, భగవద్గీత ప్రచారకులు ప్రభుజి హృషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసాదం పంపిణీకి సహకరించిన తొనుపునూరి విజయలక్ష్మీ శేఖర్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, నాని, శీను, వెంకటలక్ష్మి, శ్రీను, సతీష్, వెంకట్ నారాయణ, గోపీచంద్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ధనంజయ నాయుడు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు అన్నారు. సూర్యాపేట పట్టణంలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ సాధించుకునే దిశగా ఉద్యమాలు కొనసాగించాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, నాయకులు బూర వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాగవెల్లి ప్రభాకర్ సేవలు అభినందనీయం



నాగవెల్లి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు

సూర్యాపేటటౌన్ : సుదీర్ఘ ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానంతో నాగవెల్లి ప్రభాకర్ అందించిన సేవలు అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీరామకృష్ణ విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయుడు నాగవెల్లి ప్రభాకర్ ఉద్యోగ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడి, వారి జీవితాలకు బంగారుబాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు ప్రభాకర్ అని అన్నారు. కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి, గార్లపాటి వెంకటయ్య, తెలకలపల్లి పెంటయ్య, రామడుగు రాంబాబు, పెద్దిరెడ్డి గణేష్, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్, ఎన్ సీహెచ్ వేణుగోపాలచార్యులు, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, కొల్లు మధుసూదన్ రావు, యామ రమేష్ పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



మూసివేసిన శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం



తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం

అర్వపల్లి : చంద్రగ్రహణం సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం ఆలయాలు తెరుచుకుంటాయని అర్చకులు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం.. ఇబ్బందుల్లో జనం

- డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైనే నిలుస్తున్న మురుగు
- దుర్వాసన, దోమల బెడదతో తుంగతుర్తి వాసుల ఆందోళన
- సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి



కొత్తగూడెంలో సైడ్ డ్రెయినేజీ లేక వీధిలోనే నిలిచిన వర్షపు నీరు



తుంగతుర్తిలోని ఆరో వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు, మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువై అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సమస్య తలెత్తిందని, తక్షణమే స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

6వ వార్డులో తీవ్ర సమస్య..

తుంగతుర్తి మండల కేంద్రంలోని 6వ వార్డులో పరిస్థితి దారుణంగా ఉంది. వర్షాలు ఆగి వారం అవుతున్నా, ఇంకా ఇళ్లలోకి చేరిన మురుగునీరు అలాగే నిలిచి ఉంది. దీంతో ఇళ్లల్లో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తి గ్రామ పంచాయతీ అధికారుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు..

డ్రెయినేజీ లేకపోవడంతో అంబేద్కర్ చౌరస్తా నుంచి వెలుగుపల్లికి వెళ్లే రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ దుర్వాసన వెదజల్లడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది.

కొత్తగూడెంలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం..

తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం యాదవ బజార్‌లో కూడా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షపు నీరు వీధుల్లోనే నిలిచి, ఇళ్లలోకి మురుగునీరు చేరి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈ నీరు నిలిచి ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల నివారణకు మండలంలోని ఏ గ్రామంలోనూ ఫాగింగ్ చేయడం లేదని, దీనిపై అధికారులు దృష్టి పెట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి



కొత్తగూడెంలోని యాదవ బజార్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు వీధి మధ్యలోనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు ఇళ్లలోకి చేరి కుట్టడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– తొట్ల ఉపేందర్, కొత్తగూడెం

సూర్యక్షేత్రంలో హోమం, ప్రత్యేక పూజలు



తిమ్మాపురంలోని సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కె.సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, శ్రీరాం పాండే, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మోతె : రాఘవాపురం ఎక్స్‌రోడ్డులో సీనియర్ న్యాయవాది పాదిల్ల ప్రదీప్‌కుమార్ మాతృమూర్తి అనసూయమ్మ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని ప్రదీప్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట అనసూయమ్మ కుమారులు పాదిల్ల ప్రదీప్‌కుమార్, పాదిల్ల రవీందర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటరమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అడ్వకేట్ రామారావు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

మురుగు నీరు సాఫీగా పారేదెలా..

- ఆత్మకూరులో పూడిన డ్రెయినేజీలు
- దుర్వాసనతో స్థానికుల ఆవేదన



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ (ఎస్)లోని ఎస్‌బీఐ సమీపంలో మురుగు కాలువలు పూర్తిగా పూడిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో చెత్తాచెదారం, మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్య వర్షాల కారణంగా మరింత ఎక్కువైంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు కూడా ఈ మురుగునీటిలో కలిసిపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. నిలిచి ఉన్న మురుగునీటిలో దోమలు విపరీతంగా పెరిగి, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి, పూడిక తీత పనులు చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. కాలువను శుభ్రం చేసి, మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను సంప్రదించగా.. ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో మురుగు కాలువ లేకపోవడం వల్ల నీరు కిందకు వెళ్లడం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో కాలువను శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు.

దుర్వాసనతో ఇబ్బందులు



ఇటీవల కురిసిన వర్షానికి చెత్తాచెదారం వచ్చి కాలువలో నిలిచిపోయింది. దీంతో దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించి, నీరు సాఫీగా వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలి.

– కృష్ణారెడ్డి, ఆత్మకూర్(ఎస్)